శైలపుత్రిగా వనదుర్గమ్మ



అమ్మవారి పల్లకీ సేవలో మాధవానంద సరస్వతి స్వామి, ఈవో చంద్రశేఖర్ తదితరులు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో గురువారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో చంద్రశేఖర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామిజీ రాజగోపురంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆలయం ముందు వరద ఉండటంతో తెల్లవారుజామున అర్చకులు మాత్రమే గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారికి పంచామృతాభిషేకం చేపట్టారు. నవరాత్రోత్సవాల్లో తొలి రోజు సందర్భంగా ముదురు పసుపు రంగు చీరతో శైలపుత్రి (బాలా త్రిపురసుందరి దేవీ)గా అలకరించారు. సహస్ర నామార్చన చేసి గర్భగుడిని మూసేశారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీసేవతో ఊరేగింపుగా తీసుకొచ్చి గోకుల్‌షెడ్‌లో ప్రతిష్ఠించారు. విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కొనసాగింది. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. ఆయనకు ఈవో ప్రసాదం అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి, గోవింద్ నాయక్, చందనారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులున్నారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 25,000 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది.



శైలపుత్రి అలంకరణలో..

అమ్మ రాక.. ఆనందాల వేడుక



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, యువకుల నృత్యాలు, వేదమంత్రాల మధ్య అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయాలు, ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించారు. విద్యుద్దీపాలతో మండపాలు, ఆలయాలు అలంకరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణ పసుపులేరు ఒడ్డున ఉన్న రేణుకాంబ ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి తేజోవంతంగా అలంకరించారు. – న్యూస్‌టుడే, మెదక్ అర్బన్

చాముండేశ్వరాలయంలో..

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ శివారులోని చాముండేశ్వరి మాత ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం ఆలయం ముందు ప్రవహిస్తున్న మంజీరా నుంచి నీటిని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మకు మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం కలశపూజ తదితర కార్యక్రమాలు కొనసాగాయి. మధ్యాహ్నం మహా నివేదన నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్ష్యం మేర రుణాల పంపిణీ

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మహిళా సంఘాలకు లక్ష్యం మేర రుణాలు పంపిణీ పూర్తిచేయాలని డీఆర్డీవో శ్రీనివాసరావు సూచించారు. గురువారం పెద్దశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో సెర్ప్, ఉపాధిహామీ సిబ్బందితో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి పనుల ప్రగతిపై ఆరా తీశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు చెల్లించడం, దీంతో కలిగే ప్రయోజనాలను వివరించి, రికవరీ వేగిరం చేయాలన్నారు. ఉపాధి సిబ్బంది రోజ్‌గార్ దివస్‌ను ప్రతివారం ఏర్పాటు చేసి పనులు, నాణ్యతపై అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గ్రామసభల్లో పక్కాగా గుర్తించాలని చెప్పారు. అంతకుముందు మాడ్చట్‌పల్లి, ఉత్తులూరులలో పండ్ల తోటలను పరిశీలించారు. ఎంపీవో విఠల్‌రెడ్డి, ఏపీవో నవాజుద్దీన్, ఏపీఎం గోపాల్, టీఏలు, సీసీలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాడ్చట్‌పల్లిలో పండ్ల తోటలను పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీనివాసరావు

తగ్గిన వరిసాగు



న్యూస్‌టుడే, చేగుంట: జిల్లాలో ప్రధానమైన సాగు వరి పంటే కావడంతో, ఏటా విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ఈ సారి మాత్రం తగ్గింది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గతేడాది వానలు సమృద్ధిగా కురవడంతో 3లక్షల ఎకరాల్లో సాగు చేయగా, మంచి దిగుబడులు వచ్చాయి. ఈ సారి మాత్రం వరుణుడు దోబూచులాడాడు. ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండాయి. అప్పటికే నాట్లు వేసే అవకాశం లేకుండా పోయింది. జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 3,27,113 ఎకరాలు కాగా సాగైంది 2,98,067 ఎకరాలు. పాపన్నపేట, కొల్చారం, చిన్నశంకరంపేట, వెల్దుర్తి, కౌడిపల్లి, మెదక్, నర్సాపూర్, శివ్వంపేట, రామాయంపేట, టేక్మాల్, నిజాంపేట, చేగుంట, హవేలిఘనపూర్ తదితర మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. భూగర్భజలాలు పెరగడంతో యాసంగి సీజన్‌లో కూడా వరి సాగు చేసిన రైతులకు ఎటువంటి సమస్య ఉండదు. నెల రోజుల్లో దిగుబడులు చేతికి రానున్నాయి.

జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్య బదిలీ

మెదక్, న్యూస్‌టుడే: జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్య బదిలీ అయ్యారు. ఈ ఏడాది మార్చిలో సీపీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన నల్గొండ ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గణాంక అధికారి (ఎస్‌వో)బద్రీనాథ్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

బియ్యం కుతకుత.. నూనె సలసల

సిద్దిపేటకు చెందిన సురేశ్ చిరుద్యోగి. చిన్నపాటి వేతనంతో ఆరుగురి కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. ప్రతి నెలా ప్రణాళికతో వెచ్చిస్తుంటారు. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులకు పక్కాగా ఖర్చుపెడుతుంటారు. కొన్నాళ్లుగా పెరిగిన ధరలతో లోటు బడ్జెట్ ఎదుర్కొంటున్నారు. నిత్యావసర ధరలు అమాంతం పెరగడంతో ప్రతి నెలా రూ.3 వేలు ఖర్చు చేయగా.. కొన్నాళ్లుగా ఆ పద్దు రూ. 4,500కు పెరిగింది.

న్యూస్‌టుడే, మెదక్, మెదక్ టౌన్, వెల్దుర్తి

నూనె ధర చేజారుతోంది.. బియ్యం ఉడకనంటోంది.. పప్పు బద్ద కిస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న నిత్యావసర ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు బేజారవుతున్నాయి. ప్రతి నెలా నిర్వహణ ఖర్చులు భారంగా మారుతున్నాయి. ఇంటి సారథి.. కుటుంబాన్ని వెళ్లదీసేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న ధరలతో షాక్‌కు గురవుతున్నారు. పెద్ద పండగలైన దసరా, దీపావళి వచ్చేశాయి. పండగల వేళ జనమంతా ఇబ్బందులకు గురవుతున్నారు.

పండుగల వేళ ధరల దడ



దడ పుట్టిస్తోంది..

పెరుగుతున్న బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. క్వింటాకు రూ.500 నుంచి రూ. వేయి వరకు పెరిగింది. నెల వ్యవధిలో పెరుగుదల ప్రభావం చూపింది. ఐదుగురు ఉండే ఇంట్లో నెలకు కనీసం 40 నుంచి 50 కిలోల బియ్యం వాడుతారు. పాత సన్నబియ్యం ధరలు భారీగా పెరగడంతో దొడ్డురకం వైపు మళ్లుతున్నారు.

సన్నబియ్యం ధర (రూ.లలో..)	
గతేడాది	5500
ప్రస్తుతం	7000

కొనలేక..

ఎండు కొబ్బరి వంటకాల్లో రుచిని పెంచుతుంది. చిక్కదనాన్ని, పోషకాలను అందిస్తుంది. పది రోజుల్లో ధర అమాంతం పెరిగింది. ఆరు నెలల్లో పప్పుల ధరలు పెరిగాయి. మరోవైపు కిలో నువ్వులు రూ. 180కు చేరింది. చక్కెర రూ.41, గోధుమపిండి రూ.40, రవ్వ- రూ.42 పలుకుతోంది. గతంతో పోలిస్తే రూ.5 పెరిగినట్లు స్పష్టమవుతోంది. కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి.

నిత్యావసరం	గతేడాది	ప్రస్తుతం (రూ.లలో..)
ఎండుకొబ్బరి	140	220
కంది పప్పు	140	180
పెసర పప్పు	110	130
శనగ పప్పు	80	120
చక్కెర	38	42
చింతపండు	100	140






20 శాతం పెరిగి..


వంటనూనె ధరలకు రెక్కలొచ్చాయి. 15 రోజుల్లోనే 20 శాతానికి పైగా పెరిగింది. ఈ మార్పు స్పష్టమైంది. సన్ ఫ్లవర్, రైస్ బ్రాన్, పల్లీ నూనె కొనలేని పరిస్థితి. ప్రతి నెలా సగటున 5 కిలోలు వినియోగించగా.. ఇప్పుడు 3 కిలోలకు తగ్గించేందుకు చూస్తున్నామని గజ్వేల్‌కు చెందిన మారుతి చెప్పుకొచ్చారు. పండుగ సీజన్‌లో పిండి వంటలకు నూనె వినియోగం తప్పనిసరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో పడిపోతున్నారు.

నూనె ధర (రూ.లలో..)	
గతేడాది	110
ప్రస్తుతం	135

నిత్యావసర ధరలు తగ్గాలంటే ఏం చేయాలి?

జిల్లాలో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన 100 మందితో 'న్యూస్‌టుడే' నిర్వహించిన సర్వేలో ఇలా స్పందించారు.





ప్రభుత్వం నుంచి మీరు కోరుకునేది?



అదుపులోకి తేవాలి: కీర్తి, గృహిణి, మెదక్

మా ఇంట్లో నెలకు 50 కిలోల బియ్యం అవసరం. 5 కిలోలు వంటనూనె వాడేవారం. ఇప్పుడు పొదుపుగా వాడుతున్నాం. మిగతావాటి ధరలూ పెరిగాయి. కూరగాయలు కొనలేని పరిస్థితి. ధరలను అదుపులోకి తెచ్చేందుకు అధికారులు అన్ని రకాలుగా కృషి చేయాలి.



వినియోగం తగ్గించాం: జమున, వెల్దుర్తి

బియ్యం, నూనె, పప్పు ధరలు పెరగడంతో కొనాలంటే ఇబ్బందిగా ఉంటోంది. ఆర్థిక భారం పడుతోంది. పప్పులకు ప్రత్యామ్నాయంగా పొలంలో లభించే కూరగాయలు ఎక్కువగా తింటున్నాం. వంటనూనె వినియోగం తగ్గించాం. ధరలు తగ్గించాలి.

పునాదికే పరిమితం.. దృష్టి సారిస్తే ప్రయోజనం

నార్సింగికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేశారు. భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలంలో పనులు చేపట్టి పునాది వరకు నిర్మించారు. అనంతరం నిధులు లేకపోవటం వల్ల అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అదనపు గదుల్లో కళాశాలను కొనసాగిస్తున్నారు. ఇక్కడ సరైన వసతులు లేక విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. నార్సింగి, శేరిపల్లి, మీర్జాపల్లి, నర్సంపల్లి, వల్లభాపూర్, కాస్లాపూర్, సంకాపూర్, జప్తిశివునూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. శౌచాలయాలు కూడా లేవు. భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నార్సింగి(చేగుంట)



సమస్య: కళాశాల భవన నిర్మాణం	ఎక్కడ: నార్సింగి	విద్యార్థులు:
	ఎన్నేళ్లుగా: 11	160 మంది
	కారణం: నిధుల లేమి	

ప్రస్తుతం కొనసాగింపు : జడ్పీ ఉన్నత పాఠశాల అదనపు గదుల్లో

వివరాలు పక్కాగా నమోదు



మెదక్‌లో జరిగిన సర్వేలో పాల్గొన్న ఆర్డీవో రమాదేవి

మెదక్, నర్సాపూర్, చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించేందుకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. ఇందులో భాగంగా గురువారం జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రత్యేక సర్వేకు శ్రీకారం చుట్టారు. నర్సాపూర్‌లోని 8వ వార్డులో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులు చేపట్టిన సర్వే తీరును పరిశీలించారు. మెదక్‌లో ఆర్డీవో రమాదేవి పరిశీలించి అధికారులను అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల వారు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల పేర్లు, జెండర్, ఆధార్ నంబరు తదితర వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రోజూ కనీసం 50 కుటుంబాల వివరాలు సేకరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తిచేయాలని చెప్పారు. అధికారులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలం కామారంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పర్యటించి సర్వేను పరిశీలించారు.

ఉపాధికి ప్రణాళిక

న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట

వలసల నివారణకు ఉన్న గ్రామంలోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిరుపేదలకు బాసటగా నిలుస్తోంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల తీరుపై ప్రణాళిక రూపకల్పనకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అక్కడి ప్రజల సమ్మతంతో పనులు గుర్తిస్తున్నారు. అక్టోబరు 2న దీనికి శ్రీకారం చుట్టగా ఈ నెలాఖరు వరకు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు.



జంబికుంట గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామసభ

జిల్లాలో..	
జాబ్‌కార్డులు	1,64,249
కూలీలు	3,31,997
2024-25లో పనిదినాల లక్ష్యం:	40.28 లక్షలు
ఇప్పటి వరకు పూర్తయినవి:	39.09 లక్షలు
ప్రస్తుతం కూలీల హాజరు:	1,52,000
ఇప్పటివరకు చెల్లించిన కూలి:	రూ.87.20 కోట్లు
సామగ్రికి చెల్లింపులు:	రూ.52.99 కోట్లు
వంద రోజులు పనులు కల్పించిన కుటుంబాలు:	1742

ప్రాధాన్యం ఇలా..

పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, కట్టుకాల్వల పనులు చేపట్టారు. ఈ సారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాలువలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

వంద రోజుల పని..

పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు ముందుగా ఆయా గ్రామానికి అవసరమైన పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో ఇప్పటినుంచే ప్రక్రియ చేపట్టారు. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది. తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంది.

ఇప్పటినుంచే గుర్తించి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. జిల్లాలోని 469 గ్రామ పంచాయతీలలో ఈ నెలాఖరులోపు గ్రామసభలు పూర్తిచేసి, నవంబరులో మండలాలవారీగా ప్రణాళిక తయారుచూసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి ప్రతిపాదిస్తారు.

పకడ్బందీగా..: శ్రీనివాసరావు, డీఆర్డీవో

వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించేందుకు గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించాం. ఈ సారి వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం కల్పించనున్నాం.

స్పందించి.. చదును చేసి..

ఈనాడు కథనానికి స్పందన

మెదక్‌లోని ఇందిరా గాంధీ మైదానంలో రూ. 55 లక్షలతో నిర్మించిన ఫుట్‌బాల్ మైదానం గుంతలమయంగా మారింది. క్రీడాకారులు అక్కడ ఆడలేని పరిస్థితి ఏర్పడింది. ఆ గుంతలను పూడ్చేందుకు ఇసుక తెప్పించి అలాగే ఉంచేశారు. ఈ తీరుపై గత నెల 14న 'ఇసుక పోసి.. ఇలా వదిలేసి' శీర్షికన 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు చదును చేసే పనులు ప్రారంభించారు. త్వరలో పూర్తి చేసి ఆడుకునేందుకు వసతులు కల్పిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, మెదక్ టౌన్



పనులు చేపట్టారిలా..

నేడు సీఎం కప్ టార్చ్ ర్యాలీ

మెదక్, న్యూస్‌టుడే: సీఎం కప్ టార్చ్ ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం మెదక్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మెదక్ మండలం మంబోజిపల్లి నుంచి పట్టణంలోని స్టేడియం వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు, క్రీడా సంఘాలు, ఒలింపిక్ అసోసియేషన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

నర్సాపూర్, న్యూస్‌టుడే: వ్యక్తిగత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే రోగాలు ప్రబలవని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం నర్సాపూర్ పురపాలిక ఆవరణలో ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురపాలిక అధ్యక్షుడు అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. ఆరోగ్యంలో ఇబ్బంది అనిపించగానే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కమిషనర్ రామకృష్ణారావు, ఉపవైద్యాధికారిణి డాక్టర్ సృజన, మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

మెదక్: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన గురువారం కొనసాగింది. స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 92 ఉండగా, 1:3 ప్రకారం 249 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 153 మంది హాజరయ్యారు. భాషా పండితుల పోస్టులు 30కి 68 మందిని పిలిచారు. వీరిలో 50మంది వచ్చారు. ఒక వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుకు ముగ్గురు హాజరయ్యారు. 156 ఎస్జీటీ పోస్టులకు 352 మంది అభ్యర్థులను ఆహ్వానించారు. రెండో రోజు 77 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. డీఈవో రాధాకిషన్ పర్యవేక్షించారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే చేపట్టాలి



మంగంపేటలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ప్రత్యేకాధికారిణి హరిచందన

జిన్నారం, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని మంగంపేటను ఎంపిక చేయడంతో గురువారం నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వేను జిల్లా ప్రత్యేకాధికారిణి హరిచందన పరిశీలించారు. ముందు బృందాలుగా ఏర్పాటైన కార్డుల జారీ కోసం వివరాలు సేకరిస్తున్న తీరును తహసీల్దార్ భిక్షపతి ఆమెకు వివరించారు. ఇంట్లో మొత్తం సభ్యులు, కార్డు యజమానిగా మహిళ ఉండేలా తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. గ్రామంలో 179 కుటుంబాలుండగా మొదటి రోజు 134 పూర్తయ్యాయి. ఎంపీడీవో అరుణారెడ్డి, ఎంపీవో రాజ్‌కుమార్, తదితర అధికారులకు హరిచందన పలు సూచనలు చేశారు. లోపాలు లేకుండా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదేశించారు. పటాన్‌చెరు నియోజకవర్గ నోడల్ అధికారి దేవుజా తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో ఎదిగి.. ఐక్యతతో ఒదిగి

విద్యార్థి దశలో కీలకంగా ఎన్‌సీసీ

సద్వినియోగంతో భవిత ఖాయం

ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారు పేరు. విద్యార్థి దశలో జాతీయ భావాలు పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సమగ్రతకు బాట వేసేలా.. ఏకతా నినాదాన్ని వినిపిస్తుంది. సేవ వైపు మళ్లిస్తుంది. గొప్ప వ్యక్తిత్వంతో ఉన్నతంగా రాణించేందుకు బాటలు వేస్తుంది. ఆ దిశగా నేడు విద్యా సంస్థల్లో ప్రేరణ కల్పించడంలో నేషనల్ కేడెట్ కార్ప్స్ కీలకపాత్ర పోషిస్తోంది. డిగ్రీ దశలో ఈ బృందాలు.. ప్రభావవంతంగా, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 17 డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో ఎన్‌సీసీ అమలవుతోంది. 1546 మంది విద్యార్థులు కేడెట్లుగా కొనసాగుతున్నారు. సిద్దిపేట నగరం ప్రతిభావంతులతో నిలిచిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు ఇప్పటి వరకు 21 మంది అగ్నిపథ్‌లో చేరారు. ఏటా పోలీసు లేదా ఆర్మీలో 10 మంది కొలువులు సాధిస్తున్నారు. మెదక్, సంగారెడ్డిలోనూ కేడెట్లు ఉద్యోగాలు సాధిస్తున్నారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి టౌన్, మెదక్ టౌన్, వికారాబాద్ టౌన్

సంగారెడ్డి జిల్లా నాగలిగిద్దకు చెందిన జి.సతీశ్ కుమార్ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతేడాది డిగ్రీ పూర్తిచేశారు. 2023లో తృతీయ సంవత్సరం చదువుతున్నప్పుడే పోలీసు కానిస్టేబుల్ (సివిల్) పరీక్ష రాసి లక్ష్యాన్ని సాధించారు. 9వ తరగతిలో ఎన్‌సీసీలో చేరడం కలిసొచ్చింది. దీని కోటా కింద కొలువుకు దరఖాస్తు చేసుకొన్నా.. మార్కులు కలిసొచ్చాయి. ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు.

జనరల్ ఎలక్టివ్ పేపర్..

గతంలో ఎన్‌సీసీ సహ పాఠ్య కార్యక్రమంగా కొనసాగించారు. గతేడాది నుంచి దీన్ని కోర్సులో ఒక పేపర్‌గా గుర్తించారు. గత విద్యాసంవత్సరంలో ఎన్‌సీసీని ఒక పేపర్‌గా గుర్తించాలని యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) అన్ని వర్సిటీలకు సూచించింది. జనరల్ ఎలక్టివ్ (జీఈ) పేపర్‌గా డిగ్రీ తృతీయ సంవత్సరంలో విద్యార్థులు ఎంచుకోవచ్చు. ఇతర పేపర్ల మాదిరిగానే క్రెడిట్లు (మార్కులు) పొందే వీలుంది. ఉన్నత విద్యలో చేరేందుకు 'సి' సర్టిఫికెట్‌ను ఉపయోగించుకుంటున్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులు

శిక్షణ.. బాధ్యతలు

- విద్యాసంవత్సరంలో మొత్తంగా కేడెట్లకు 40 వరకు తరగతులు నిర్వహిస్తారు.
- కవాతు, మ్యాప్ రీడింగ్, సాయుధ శిక్షణ, సామాజిక సేవలో తప్పనిసరిగా భాగస్వాములయ్యేలా చూస్తారు.
- విపత్తులు, ఇతర సందర్భాల్లో సేవ చేయాల్సి ఉంటుంది.
- వారంలో రెండు గంటలు తరగతులు, డ్రిల్ సాధన చేయాలి.
- ఏడాదిలో ఒకసారి ప్రాక్టికల్, థియరీ పరీక్షలు ఉంటాయి.
- పాఠశాల స్థాయిలో ఏ, డిగ్రీ స్థాయిలో బీ, సీ ధ్రువ పత్రాల పరీక్షలు ఉంటాయి. ప్రతి ఏటా ఒక శిబిరానికి హాజరు కావాలి.


జిల్లాల వారీగా ఇలా..

కేడెట్లు	డిగ్రీ కళాశాలలు	
600	7	సంగారెడ్డి
700	4	సిద్దిపేట
160	1	మెదక్
86	2	వికారాబాద్



సాయుధ శిక్షణలో కేడెట్లు

ఉన్నత పౌరులుగా..:



ఎన్‌సీసీలో చేరిక ఎంతో ఉపయోగకరం. మానసికంగా, శారీరకంగా దృఢంగా మారుతారు. సమస్యలు ఎదురైనా తట్టుకొని నిలబడే సామర్థ్యం కలిగి ఉంటారు. ఉన్నత విద్య, ఉద్యోగంలో మంచి అవకాశాలు ఉంటాయి. అన్ని కళాశాలల్లో అందుబాటులోకి తెస్తే మేలు.

లెఫ్టినెంట్ మహేందర్‌రెడ్డి, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి, గజ్వేల్

సద్వినియోగం చేసుకోవాలి:



విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దేశభక్తి చాటేందుకు ఇదో వేదికని గుర్తుంచుకోవాలి. విద్యార్థులకు క్రమశిక్షణ కూడా అలవడుతుంది. ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకుంటారు.

విజయ, ఎన్‌సీసీ అధికారి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి

ప్రయోజనాలు..

● విశ్వవిద్యాలయాల్లో కోటా కింద ఉన్నత విద్యలో ప్రవేశం పొందవచ్చు. ● వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే శిబిరాల ద్వారా జాతీయ సమైక్యతా భావం పెరుగుతుంది. ● దేశ రక్షణ విభాగాల్లో చేరడం సులువు. ● సర్టిఫికేట్ ఆధారంగా పోలీసు శాఖ, ఆర్మీలో ప్రాధాన్యం ఇస్తారు. ● దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ శిబిరంలో పాల్గొని కవాతు చేయవచ్చు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వృద్ధురాలి మృతి

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని రాయిలాపూర్‌కు చెందిన అన్నబోయిన సావిత్రి (65) గత నెల 28న దుబ్బాకకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గ్రామ శివారులో కుక్కలు అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. సావిత్రిని ములుగు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కోడలు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మరో ఘటనలో యువకుడు..



నవీన్

కంది: ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాలు.. కంది మండలం చిమ్నాపూర్‌కు చెందిన ఏర్పుల నవీన్(36) ఐఐటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో కుక్కలు అడ్డురావడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు గాయాలు కాగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనతో ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య శిరీష సంగారెడ్డి రూరల్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

చికిత్స పొందుతూ మహిళ..



లక్ష్మి

మిరుదొడ్డి: ద్విచక్ర వాహనంపై నుంచి పడి గాయాలైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. భూంపల్లి ఎస్సై హరీష్ తెలిపిన వివరాలు.. మిరుదొడ్డి మండలం అల్వాలకు చెందిన లక్ష్మి తనకుమారుడితో కలిసి గతనెల 25న ద్విచక్ర వాహనంపై మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంటకు బయలుదేరారు. అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతారెడ్డిపేట శివారులో బైక్ అదుపుతప్పి కింద పడగా లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పాము కాటుకు బాలుడి బలి



మణికేశ్వర్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: పాము కాటుతో బాలుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన తుమ్మల శ్రీనివాస్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మణికేశ్వర్(7) ఉన్నారు. శ్రీనివాస్ ఉపాధికి 20రోజుల కిందట గల్ఫ్ వెళ్లాడు. లక్ష్మి బీడీ కార్మికురాలిగా పని చేస్తోంది. బడికి సెలవులు కావడంతో గురువారం మణికేశ్వర్ తల్లి వెంట బీడీ కంపెనీకి వెళ్లాడు. అక్కడ ఖాళీ స్థలంలో బాలుడు అట్టపెట్టెను తీస్తుండగా, నాగుపాము కాటు వేసింది. ఈ విషయాన్ని అక్కడున్న వారు గమనించలేదు. కాలుకు ఏదో గుచ్చుకుంది అని భావించారు. ఇంటికి వెళ్లే సరికి మణికేశ్వర్ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. గ్రామస్థులంతా బీడీ కంపెనీ వద్దకు వెళ్లి, ఖాళీ అట్టపెట్టెలను తొలగించి చూడగా నాగుపాము కనిపించింది. పాము కాటుతోనే బాలుడు మరణించాడన్నారు. మణికేశ్వర్ ఒకటో తరగతి చదువుతున్నాడు. చిన్నారి మృతితో విషాదం అలుముకుంది.

సాంకేతికత తోడుగా విద్యుత్తు సేవలు



విద్యుత్తు వినియోగదారులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో టీజీ ఎన్పీడీసీఎల్ అడుగులేస్తోంది. ఇందులో భాగంగా సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వినియోగంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. వినియోగదారుడు తన అరచేతిలో ఉండే చరవాణి నుంచే పలు రకాలుగా వినియోగించుకునే అవకాశం ఉంది. నూతన సాంకేతికతను జోడించి వినియోగదారుల సౌకర్యార్థం 19 రకాల ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకు చేయాల్సిందల్లా స్మార్ట్‌ఫోన్‌లో కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుంది. సంబంధిత అధికారులు దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు దీనిద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

ఏ మేర పెరిగిందో..: ఇందులో బిల్లు కాలిక్యులేటర్‌ను సైతం అందుబాటులో ఉంచారు. ఎన్ని యూనిట్లు వాడితే ఎంత బిల్లు వస్తుంది, యూనిట్లు ఎక్కువైన కొద్ది ఛార్జీ పెరిగే తీరు తెలుసుకోవచ్చు. ఆయా ఆప్షన్లతో పాటు కొత్త కనెక్షన్ పొందడం, పేరు, లోడు మార్పు, విద్యుత్తు నిబంధనలు, టారిఫ్ వివరాలు, ఏ విభాగానికి ఎంత ఛార్జి, గృహ, గృహేతర, పరిశ్రమలు తదితర వివరాలూ చూసుకోవచ్చు. పొదుపు, సూచనలనూ పొందుపరిచారు. ప్రమాదం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగదారుల ఫీడ్ బ్యాక్ కూడా ఇచ్చే వీలుంది. టోల్ ఫ్రీ నంబరును సైతం పొందుపరిచారు.

- న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

యాప్‌లో ఇలా..

రిపోర్టు ఆన్ ఇన్సిడెంట్: ఎక్కడైనా ఏదైనా ప్రమాదం, ఘటన జరిగితే జీపీఎస్ లోకేషన్‌తో చరవాణిలో ఫొటో తీసి అధికారులకు పంపించవచ్చు. సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదు నమోదు: వినియోగదారులు తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు. మీటరు నంబరు, సమస్య రాస్తే దాన్ని పరిష్కరిస్తారు. అది ఏ స్థాయిలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. ఒకవేళ సమస్య తీరకపోతే మరో సారి ఫిర్యాదు చేయవచ్చు.

సెల్ఫ్ రీడింగ్: ప్రతి నెలా విద్యుత్తు సిబ్బంది వచ్చి మీటరు రీడింగ్ తీస్తారు. అలా కాకుండా వినియోగదారుడే నేరుగా మీటరు రీడింగ్ తీయవచ్చు. ఎంత మేర విద్యుత్తు వాడాం, ఏ మేర బిల్లు వచ్చిందో తెలుసుకోవచ్చు.

బిల్లు చెల్లింపు: యాప్ ద్వారా బిల్లు చెల్లించవచ్చు. ఆయా వివరాలు వెంటనే చూసుకునే వీలుంది. గతంలోని వివరాలూ తెలుసుకోవచ్చు.

ఆధార్ లింక్: విద్యుత్తు మీటరుకు ఆధార్‌తో పాటు చరవాణి నంబరు అనుసంధానం చేసి ఉంటే ప్రతి నెలా బిల్లు, ఇతర వివరాల సందేశాలు వస్తాయి. అధికారులు ఇప్పటికే ఆయా వివరాలు నమోదు చేశారు. అయితే చాలా మంది నమోదు చేసుకోలేదు. అలాంటి వారు యాప్‌లో వాటిని నమోదు చేసుకోవచ్చు.

విధుల్లో నిర్లక్ష్యం.. పోలీసు అధికారులపై వేటు

వికారాబాద్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా, విధులలో నిర్లక్ష్యం.. వెరసి వికారాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలపై పోలీసు శాఖ చర్యలకు ఉపక్రమించింది. వికారాబాద్ పట్టణ సీఐ నాగరాజును సస్పెండ్ చేయగా, తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్‌లను ఐజీ కార్యాలయానికి, యాలాల, పెద్దేముల్ ఎస్ఐలు శంకర్, గిరన్నలను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం(అటాచ్) చేస్తూ మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. జోగిపేట సీఐగా విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో వికారాబాద్ సీఐ నాగరాజు ఓ మైనర్‌పై జరిగిన అత్యాచారం కేసులో విధుల పట్ల నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడటంతో పాటు కేసును నీరుగార్చేలా దర్యాప్తు చేశారన్న అభియోగంతో సస్పెన్షన్ వేటు వేశారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్, యాలాల, పెద్దేముల్ ఎస్ఐలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలం, ఇతర కారణాలతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా అనుసంధానం చేశారని పోలీస్ వర్గాలు తెలిపాయి.

సంగారెడ్డిలో ఇద్దరిపై..

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన ఇద్దరు పోలీసు అధికారులపై వేటు పడింది. సంగారెడ్డి గ్రామీణ సీఐ అశోక్, ఎస్సై వినయ్‌కుమార్‌ను వీఆర్‌కు ఆటాచ్ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి, కంది మండలాల్లోని నక్క వాగు పరిధిలో కృత్రిమ ఇసుక తయారీ జోరుగా సాగుతోంది. అనుమతుల్లేకుండా తవ్వుతుండడంతో పర్యావరణం దెబ్బతినడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని నిఘా వర్గాల ద్వారా పోలీసు శాఖ సమాచారం సేకరించింది. అక్రమార్కులకు సీఐ, ఎస్సై ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడంతో చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఆన్‌లైన్ బెట్టింగ్.. వ్యాపారి..



నవీన్

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో నష్టపోయిన వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పరుశరాములు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన ఈదారి నవీన్ (27) ఎరువులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సులువుగా ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మరలి, రూ.26 లక్షల అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. వాటిని తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపానికి గురైన పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవీన్‌కు భార్య రాధిక, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కడుపు నొప్పి భరించలేక మహిళ..

బెజ్జంకి, న్యూస్‌టుడే: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని గుగ్గిళ్లకు చెందిన కనకవ్వ(38)కు భర్త సంపత్, ముగ్గురు కుమార్తెలు ఉండగా, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మూడేళ్ల కిందట అనారోగ్య సమస్యలతో ఆమెకు శస్త్రచికిత్స చేసి గర్భసంచిని తొలగించారు. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది గురువారం పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. 108 వాహనంలో కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

రైలుకిందపడి గుర్తు తెలియని వృద్ధుడు..

తాండూరు టౌన్: రైలుకింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాండూరులో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం రైల్వే యార్డు సమీపంలో 60 ఏళ్ల వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహంపై నలుపు, ఎరుపు, తెలుపు రంగు స్వెట్టరు ఉంది. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి శవాగారంలో భద్రపరిచారు.

అనారోగ్యంతో మహిళ..

మొయినాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన సున్నం జగ్గమ్మ(28) మూడేళ్లుగా నజీబ్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటోంది. ఆమె కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో బుధవారం గుర్తు తెలియని పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఉస్మానియా దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

యువకుడిపై కత్తితో దాడి

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ యువకుడిపై కత్తితో దాడిచేసిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై క్రిష్ణారెడ్డి సమాచారం ప్రకారం.. బెజ్జంకికి చెందిన సోమని ప్రవీణ్ కొద్ది నెలలుగా కోరుట్లలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన పలువురి వద్ద కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకుండా ఆలస్యం చేస్తున్నాడని గ్రామానికి చెందిన వేల్పుల శ్రీను, వేల్పుల శ్రీకాంత్, వేల్పుల చందు, మరికొందరితో కలిసి గురువారం కారులో హైదరాబాద్ వెళ్తున్న ప్రవీణ్‌ను తోటపల్లి వద్ద అడ్డగించారు. కత్తితో దాడిచేసి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలగోకులం.. సత్ప్రవర్తనకు మార్గం



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

వికారాబాద్ జిల్లాలో వ్యాపార, వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరులో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న బాలగోకులం చిన్నారి విద్యార్థుల్లో సత్ప్రవర్తన, దేశభక్తి పెంచేందుకు దోహదపడుతోంది. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవాన్ని చూపేలా చేస్తుంది. మూడేళ్ల కిందట కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టణ శివారులో ఒక చోట బాలగోకులాన్ని నిర్వహించారు. ప్రారంభంలో కొంతమంది పిల్లలే వచ్చారు. వారికి ఉపాధ్యాయులు ఆధ్యాత్మికం, దేశభక్తి, సమాజంలో మెలిగే తీరు, తదితర అంశాలను బోధించారు. ఇవన్నీ తల్లిదండ్రులకు నచ్చడంతో తమ పిల్లలను ఇక్కడికి పంపించే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇక్కడ విజయవంతమైన బాలగోకులాన్ని పట్టణంలో విస్తరించాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు. ఇలా ప్రస్తుతం మూడు చోట్ల ప్రతి ఆదివారం బాలగోకులం నిర్వహిస్తుండటం విశేషం.

ఆలయాలే వేదికగా..

ఆలయాలే వేదికగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. బసవేశ్వరనగర్‌లోని చెరువెంటి ఈశ్వరుడు, భవానీనగర్‌లోని రామలింగేశ్వరుడు, తులసీనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయాల వేదికగా జరుగుతున్నాయి. ముందుగా పిల్లలతో పూజలు, హారతి ఇప్పిస్తారు. రామాయణ, మహాభారత శ్లోకాలు నేర్పిస్తారు. నీతికథలు చెబుతారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం ఎలాగో నేర్పిస్తారు. అదే సమయంలో కుల, మతాలు లేని స్నేహం గురించి వివరించడంతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. చదువుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. పిల్లలు భవిష్యత్తులో సత్ప్రవర్తన కలిగి ఉండటం, ఉన్నత స్థాయికి ఎదగడం, సమాజం పట్ల సదాభిప్రాయం, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని బాలగోకులం నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వరూప, శివకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆనందం తెలిపారు.

- న్యూస్‌టుడే, తాండూరు

గజ్వేల్.. మంత్రుల రాకతో జిగేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం, ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గురువారం రావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. సభలో మంత్రుల ప్రసంగాలకు హాజరైన వారు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. బోనాలు, కోలాటాలతో కళాకారులు ప్రదర్శన చేపట్టారు. గజ్వేల్ పట్టణమంతా ఒక్కసారిగా ముగ్గురు మంత్రులు రావడంతో ఆద్యంతం సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, గజ్వేల్



గజ్వేల్‌లో ప్రజ్ఞాపూర్ నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలో పార్టీ శ్రేణులు



ర్యాలీలో బోనాల ఊరేగింపు, కోలాటం, ఒగ్గు కళాకారుల ప్రదర్శన

ఉన్నతీకరించి.. ఉపయోగమేది?

● మినీ అంగన్‌వాడీల్లో జాడ లేని జీతభత్యాల పెంపు

న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట, పరిగి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వెయ్యి జనాభా ఉన్న ప్రాంతంలో ప్రధాన కేంద్రం, అంతకంటే తక్కువ జనాభా ఉంటే మినీ అంగన్‌వాడీలను నెలకొల్పింది. అయితే మినీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరగడంతో అక్కడ అందించే సేవలు ఇబ్బందికరంగా మారాయి. ఆయాల నియామకాలు లేకపోవడంతో, అంగన్‌వాడీ టీచర్లే నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం గత జనవరిలో మినీ కేంద్రాలను ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సమస్యలు పరిష్కారం అవుతాయని అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఉత్తర్వులకే పరిమితం..

రాష్ట్రవ్యాప్తంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఎనిమిది నెలల కిందట ఇచ్చిన ఉత్తర్వులు కాగితాలకే పరిమితమయ్యాయి. చాలా చోట్ల శాశ్వత భవనాలు కరవయ్యాయి. పిల్లలను ఆడించేందుకు ఆట వస్తువులు, ఇతర సామగ్రి కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాలేదు. కేవలం సరకులు ఇస్తుండగా, కేంద్రాలను నెట్టుకొస్తున్నారు.

● కేంద్రాలకు పక్కా భవనాలు లేక పాఠశాల అదనపు గదులు, సామాజిక, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మినీ కేంద్రాల్లో ఆయా పోస్టులు అవసరం. వీటి భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించినా ఇప్పటివరకు అడుగు పడలేదు. ఒక్కో మినీ కేంద్రంలో ఒక్కో టీచరు పని చేస్తుండగా ప్రతి నెలా రూ.7,800 చొప్పున వేతనం అందిస్తున్నారు. కేంద్రాల ఉన్నతీకరణ తర్వాత రెండు నెలలు టీచర్లకు పెంచిన జీతాలు రూ.13,650 చొప్పున అందజేసి, ఆ తర్వాత నిలిపివేశారు.

నాలుగు జిల్లాల్లో వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన	మినీ
మెదక్	1,076	191
సంగారెడ్డి	1,444	160
సిద్దిపేట	1,084	66
వికారాబాద్	757	350

విడుదల కావాల్సి ఉంది:

మినీ కేంద్రాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. రెండు నెలలు పెంచిన జీతాలను టీచర్లకు అందించాం. బడ్జెట్ కేటాయింపు లేక మళ్లీ పాత వేతనాలే జమయ్యాయి. పెంచిన వేతనాలు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

బ్రహ్మాజీ, మహిళ,శిశు సంక్షేమాధికారిణి, మెదక్

అత్యాచార నిందితుడిని శిక్షించాలి: ప్రభుత్వ విప్

చేర్యాల: కొమురవెల్లి మండలం గురువన్నపేటలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం డిమాండ్ చేశారు. కురుమ సంఘం ప్రతినిధుల బృందం గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సిద్దిపేటకు వెళ్లి సీపీ అనూరాధకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు క్యామ మల్లేశ్, నాయకులు ఉన్నారు. బాలిక ఇంటర్మీడియట్ వరకు విద్య అందించే బాధ్యత తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	112–00
రిటైల్	134–00
డ్రెస్డ్	194–00
స్కిన్‌లెస్	221–00

బస్టాండు ఎదుట గుంతల పూడ్చివేత



కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి బస్టాండు ఎదుట ఉన్న గుంతలను సీసీతో పూడ్చి వేయించారు. 'ప్రయాణ ప్రాంగణాలు..వానొస్తే అగచాట్లు' అనే శీర్షికన జులై 28న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు గురువారం స్పందించారు. మెదక్ డిపో మేనేజర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ నిధులను వెచ్చించి పనులను చేస్తున్నారు. ఆర్టీసీ తరపున ఏఈ అమర్‌సింగ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. బస్సులు లోపలికి రావడానికి, బయటకు వెళ్లడానికి ర్యాంపులాగా ఏర్పాటు చేశారు.

ఈనాడు కథనాలకు స్పందన

ఇనుప స్తంభం తొలగింపు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం సికింద్లాపూర్‌లో ఇళ్ల మధ్య ఇనుప స్తంభం ప్రమాదకరంగా మారిందని సెప్టెంబర్ 25న 'ఇనుప స్తంభం తొలగించరూ..' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి విద్యుత్తు శాఖ ఏఈ సాయికుమార్ స్పందించారు. నరేష్ కుర్మ ఇంటివద్ద ఉన్న స్తంభం తొలగించి కొత్త సిమెంటు స్తంభం ఏర్పాటు చేయించారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం

న్యూస్‌టుడే, హవేలిఘనపూర్: ప్రగతి పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. కొన్నిచోట్ల గుత్తేదారులు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని వాడి పంచాయతీ పరిధి దూప్‌సింగ్ తండాకు వాగు పైనున్న వంతెన మీదుగా వెళ్లాలి. కొన్నేళ్ల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. బాగు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. 2021లో కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద రావడంతో వంతెన ధ్వంసమైంది. దీంతో అప్పటి ప్రభుత్వం స్పందించి రూ.3 కోట్లు మంజూరు చేయగా.. 2022లో నిర్మాణ పనులు ప్రారంభించారు. 2023 వానాకాలంలో భారీ వరదలు రావడంతో పనులు నిలిపేశారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు వంతెన పూర్తిగా ధ్వంసం అయింది. వరదలు తగ్గిన తర్వాత తాత్కాలికంగా వంతెన మీదుగా మట్టి పోయడంతో రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వానలకు వంతెన పూర్తిగా ధ్వంసం కావడంతో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పరిశీలించి గుత్తేదారులను మార్చి పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు.



కంకర తేలిన రహదారి

రహదారులు గుంతలమయం

మండలంలోని జక్కన్నపేటకు ఇరువైపులా ఉన్న మెదక్-సర్దన, మెదక్-బోధన్ రహదారి గుంతలమయంగా మారడంతో రెండేళ్ల కిందట పునర్నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. గ్రామానికి ఇరువైపులా ఉన్న రహదారులకు రోడ్డు నిర్మాణం కోసం కంకర పరిచి వదిలేశారు. దీంతో కంకర పరిచిన రహదారి గుండా రాకపోకలు సాగిస్తూ ప్రజల ప్రమాదాల బారిన పడుతున్నారు



ఆగిన వంతెన నిర్మాణం

గుత్తేదారులకు నోటీసులు అందించాం

–పాండురంగారెడ్డి, ఏడీ మెదక్

హవేలిఘనపూర్ మండల పరిధిలోని దూప్‌సింగ్ తండా వంతెన జక్కన్నపేట రోడ్డుకు సంబంధించిన గుత్తేదారులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. దీంతో వారికి నోటీసులు అందించాం.

న్యూస్‌టుడే, అల్లాదుర్గం:

? అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో వారం రోజులుగా పలు వీధుల్లో విద్యుత్తు సరఫరా సక్రమంగా లేదు. దీంతో రాత్రిళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – రమేష్, గడిపెద్దాపూర్

✓ సిబ్బందిని క్షేత్ర స్థాయికి పంపి సమస్య పరిష్కరిస్తాం. – శివాజీ, విద్యుత్తు ఏఈ, అల్లాదుర్గం

వరి కంటే ఆయిల్‌పామ్ సాగు ఉత్తమం



రైతు వేదికలో మాట్లాడుతున్న ప్రతాప్ సింగ్

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: వరి కంటే ఆయిల్‌పామ్ తోటల పెంపకం ఉత్తమమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ సింగ్ అన్నారు. గురువారం హవేలిఘనపూర్ రైతు వేదికలో ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతేడాది నుంచి జిల్లాలో ఆయిల్‌పామ్ పెంపకం ప్రారంభమైందన్నారు. నీటి నిల్వ లేని భూములు సాగుకు అనుకూలమని, తోటలో నాలుగేళ్ల వరకు అంతర్ పంటలు సాగు చేయవచ్చని సూచించారు. రాయితీపై మొక్కలు, బిందు సేద్యం పరికరాలు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ సలహాదారు రంగనాయకులు, ఏడీఏ విజయ నిర్మల, వినయ్, ఏవో బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారాస తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

నర్సాపూర్, న్యూస్‌టుడే: సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ముఖ్యమంత్రి, మంత్రులపై భారాస సాగిస్తున్న తప్పుడు ప్రచారాల్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. గురువారం ఏడుపాయల వన దుర్గామాత దర్శనానికి వెళుతున్న ఆయన్ను నర్సాపూర్‌లో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులు శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అమ్మవారి కరుణాకటాక్షలు ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీ లలిత, మల్లేశం, అంజిగౌడ్, అశోక్‌గౌడ్, ఉదయ్ తదితరులున్నారు.

సమావేశ మందిరంలో విధులు



కౌడిపల్లి మండల పరిషత్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తించిన ఉద్యోగులు ఎట్టకేలకు సమావేశ మందిరానికి చేరుకున్నారు. కార్యాలయం వెనకాల ప్రత్యేకంగా సమావేశ మందిరం ఉండడంతో దీనినే వినియోగిస్తున్నారు. 15 రోజుల క్రితం కంప్యూటర్లు, టేబుళ్లు ఇతరత్రా సామగ్రిని మొత్తం తరలించారు. ఇటీవల భారీ వర్షాలు కురిసినప్పుడు వినియోగంలో ఉన్న గదులు సైతం దుస్థితికి చేరడంతో సిబ్బందితో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఆందోళనకు గురయ్యారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించి వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తాము సమావేశ మందిరంలో విధులు నిర్వర్తిస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. –న్యూస్‌టుడే, కౌడిపల్లి

కార్యాలయంలో వానరాల బీభత్సం



సామగ్రి చిందరవందర చేశాయిలా..

నర్సాపూర్ పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కోతులు బీభత్సం సృష్టించాయి. బుధవారం సెలవు దినం కావడంతో కార్యాలయం మూసి ఉంచారు. గురువారం రోజూ మాదిరిగానే ఉదయం తెరిచి చూస్తే అందులోని సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయని సిబ్బంది తెలిపారు. కిటికీల గుండా లోనికి ప్రవేశించిన కోతులు అల్మారాల్లోని ముఖ్యమైన రికార్డులు, పత్రాలను చిందరవందరగా పడేశాయి. ప్రాజెక్టు పరిధిలో 11 సెక్టార్లకు చెందిన పర్యవేక్షకుల నెలవారీ నివేదికలు, ఇతరత్రా సామగ్రిని ధ్వంసం చేశాయి. కోతులతో ఇబ్బందులు పడుతున్నామని, కార్యాలయానికి వచ్చే వారిపై దాడులకు దిగుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. విధులు నిర్వహించలేని పరిస్థితి ఉందన్నారు. –న్యూస్‌టుడే, నర్సాపూర్

బగలాముఖి శక్తిపీఠంలో పూజలు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో దేవీ నవరాత్రుల సందర్భంగా గురువారం శక్తిపీఠం వ్యవస్థాపకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా పీఠశ్రీయా అధ్యక్షుడు సంతోష్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.సామ్యు నాయక్, ఉపాధ్యాయులు పూజల్లో పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: పేటకు చెందిన విఠల్‌రెడ్డికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. గురువారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే నివాసంలో విఠల్‌రెడ్డి ఆస్పత్రి ఖర్చుల కోసం మంజూరైన రూ. 40 వేల చెక్కును అందించారు.

విరాళాల సేకరణ

రామాయంపేట, న్యూస్‌టుడే: ఖమ్మం వరద బాధితుల కోసం ఉద్యమ నిరుద్యోగ కళాకారుల బృందం రామాయంపేట పట్టణంలో గురువారం విరాళాలు సేకరించింది. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్‌లో రహస్యంగా ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. తూప్రాన్‌లోని శివాజీనగర్‌లో సంగ నర్సింలు అనే వ్యక్తి రహస్యంగా ఎండు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. నర్సాపూర్ ఆబ్కారీశాఖ పోలీసులు గురువారం నర్సింలు నివాసం ఉంటున్న ఇంటిపై దాడి చేశారు. ఈ క్రమంలో అతని వద్ద 250 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైందని పేర్కొన్నారు.

బోర్డు ఇలా.. హెచ్చరిక చేసేదెలా?



వాహనదారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి జాగ్రత్తగా ప్రయాణం చేసేలా జాతీయ రహదారుల విభాగం సూచికలు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. అవే ధ్వంసం అయితే దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే వాహనదారులు మార్గం తెలియక చాలా ఇబ్బందులు పడతారు. కూచారం బస్టాప్ వద్ద విభాగిని సమీపంలో ప్రమాదాలు జరిగే రహదారి వద్ద నెమ్మదిగా వెళ్లాలంటూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఇలా వంగిపోయింది. వాహనాలు ఢీకొట్టడంతో ఇలా మారింది. బోర్డు లేకపోవడంతో చోదకులు వేగంగా వెళ్లడంతో విభాగిని వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, మనోహరాబాద్

అడ్డుగా రాళ్లు పెట్టినా ప్రమాదమే!



కాళ్లకల్ గానుగు బస్తీకి వెళ్లే రహదారిలో అంతర్గత మురుగు కాలువపై నిర్మించిన మ్యాన్‌హోళ్లు ధ్వంసం కావడంతో ఓ చోట ప్రమాదకరంగా రాళ్లు అడ్డుగా పెట్టారు. నిత్యం ఈ మార్గం గుండా రాకపోకలు అధికంగా సాగుతున్నాయి. చోదకులు రాత్రి సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా రాళ్లకు ఢీకొని ప్రమాదాల బారిన పడే అవకాశముంది. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, మనోహరాబాద్

వెల్దుర్తి రూట్లలో బస్సులు నడపండి



మెదక్ డీఎంకు లేఖ అందజేస్తున్న భాజపా నాయకులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి మండలంలోని పలు రూట్లలో బస్సులు నడపాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మెదక్ డీఎంకు లేఖ రాశారు. ఈ మేరకు ఆ లేఖను భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు అంగడిపేట శ్రీనివాస్‌గౌడ్ తదితరులు మెదక్ డీఎంకు గురువారం అందజేశారు. వెల్దుర్తి నుంచి గతంలో జేబీఎస్, జోగిపేట, మెదక్, తూప్రాన్ నుంచి వెల్దుర్తి మీదుగా షటిల్ బస్సులు, నర్సాపూర్‌కు, వెల్దుర్తి నుంచి పోతంశెట్టిపల్లి మీదుగా మెదక్‌కు, సంగారెడ్డికి బస్సులు నడిచేవి. ప్రస్తుతం చాలా తక్కువగా వస్తుండటంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారన్నారు. రద్దు చేసిన బస్సులను మళ్లీ పునరుద్ధరించాలని భాజపా నాయకులు డీఎంకు విన్నవించారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పరిశీలన

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లిలో డిజిటల్ కుటుంబ సర్వేను ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ప్రతి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం తెలుపు, గులాబీ కార్డులంటూ నిబంధనలు ఏమీ లేవన్నారు. సర్వే చేస్తున్న సమయంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గ్రామానికి వెళ్లి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఉపతహసీల్దార్ అదర్, ఎంపీడీవో మధులత, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఉద్యానం ప్రారంభించండి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మెదక్ పట్టణంలో రెండేళ్ల క్రితమే పూర్తయిన పిల్లల ఉద్యానాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో నిర్వహించిన సీపీఎం ఏరియా రెండవ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని సమీకృత మార్కెట్ భవనాన్ని అందుబాటులోకి తీసుకరావడంతో పాటు మినీ ట్యాంకుబండ్ నిర్మాణానికి కేటాయించిన రూ. 9 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. అంతకుముందు ఆ పార్టీ జెండాను ఆవిష్కరించి, సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, బస్వరాజు, నాయకులు, మైనోద్దీన్, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: సీపీఎం మెదక్ ఏరియా కమిటీ కార్యదర్శిగా మల్లేశం, సహాయ కార్యదర్శులుగా లచ్చాగౌడ్, బాలనర్సయ్య, దేవయ్య, యశోద, నాగమణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో చండిక మాత



తూప్రాన్‌లో..



కొర్విపల్లిలో..



హవేలిఘనపూర్‌లో..

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పెద్దశంకరంపేట, కొర్విపల్లి, హవేలిఘనపూర్‌లలో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. దుర్గమ్మను బాలా త్రిపురసుందరి దేవీగా అలంకరించి పూజలు చేశారు. శివ్వంపేట మండలంలోని చండీ గ్రామ చండీ మాత దేవాలయంలో, తూప్రాన్ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

–న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట, శివ్వంపేట, తూప్రాన్, చిన్నశంకరంపేట

ఎంపీ సమక్షంలో భాజపాలో చేరిక



రఘునందనరావుతో మానేపల్లి యువకులు

వెల్దుర్తి: వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు గురువారం ఉదయం హైదరాబాద్‌లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో భాజపాలో చేరారు. జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, భాజపా సీనియర్ నాయకులు మల్లేశంగౌడ్, మండల అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో కాంగ్రెస్, భారాసలకు చెందిన యువకులు 25 మంది రఘునందన్‌రావు వద్దకు వెళ్లి భాజపాలో చేరారు.

తపస్ జిల్లా ఉపాధ్యక్షుల ఎన్నిక



శ్రీధర్ రెడ్డి



దేవానంద్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా ఉపాధ్యక్షులుగా ర్యావ శ్రీధర్ రెడ్డి(పీడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రంగంపేట), పూలబోయిన దేవానంద్(పీడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్లాపూర్, అల్లాదుర్గం మండలం) ఎన్నికైనట్లు తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం భవనం ప్రారంభం

రేగోడ్, న్యూస్‌టుడే: మర్పల్లిలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ఎంపీడీవో సీతారావమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవన నిర్మాణం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దిగంబర్‌రావు, టీపీసీసీ సభ్యుడు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

టెలికాం బోర్డు సభ్యుడిగా బాలచంద్రం

చేగుంట, న్యూస్‌టుడే: జిల్లా టెలికాం బోర్డు సలహా సంఘం సభ్యుడిగా చేగుంట మండలం రెడ్డిపల్లికి చెందిన మంద బాలచంద్రం నియామకం అయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు టెలికాం బోర్డు నుంచి గురువారం వచ్చాయి. తనను సభ్యుడిగా నియమించినందుకు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుకు బాలచంద్రం కృతజ్ఞతలు తెలిపారు.

మైక్‌సెట్ బహూకరణ

శివ్వంపేట, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల సందర్భంగా చండిలోని చండిక మాత దేవాలయంలో గురువారం గ్రామానికి చెందిన నార్సింగ్, పాల ఆంజనేయులు స్వంత డబ్బుతో నాగాడా బహూకరించారు. పిల్లుట్లలో బాసంపల్లి శ్రీధర్ గౌడ్ భవాని ఉత్సవ కమిటీకి రెండు మైకులు, అంప్లిఫైర్‌లను విరాళంగా అందించారు.

రైతులకు న్యాయమైన పరిహారం: ఆర్డీవో



నిర్వాసితులతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించనున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. నర్సాపూర్‌లోని రైతు వేదికలో గురువారం ఉదయం మహ్మదాబాద్, తిర్మలాపూర్ గ్రామాలు, మధ్యాహ్నం తర్వాత తుజాల్‌పూర్, పెద్దచింతకుంట గ్రామాలకు చెందిన రైతులతో విచారణ చేపట్టారు. రైతులు అడిగిన అనుమానాలను నివృత్తి చేశారు. విస్తీర్ణం, భూమి కొలతలపై అభ్యంతరాలనులు స్వీకరించారు. భూములు కోల్పోతున్న రైతుల వద్ద ఉన్న ధ్రువపత్రాలను పరిశీలించారు. భూమిపై ఏవిధంగా హక్కులు పొందారనేది ఆరాతీశారు. అవార్డు విచారణ నోటీసులు అందుకున్న రైతులు మాత్రమే దీనికి హాజరయ్యారు. పరిహారం చెల్లించే విషయంలో జిల్లా స్థాయి కమిటీ నివేదిక సమర్పించడం పూర్తయినందున వీలైనంత ఎంత చెల్లిస్తామనేది ఖరారు అవుతుందన్నారు.

మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్యాయత్నం

రామాయంపేట: మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన రామాయంపేట మండలం కాట్రియాలలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన ద్యాగల ముత్తవ్వ ఇంట్లో ఉండగా దుండగులు ఆమెపై దాడి చేశారు. ఈ క్రమంలోనే పెట్రోల్ పోసి నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె అరుపులు విని స్థానికులు రక్షించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. అయితే మంత్రాల నెపంతోనే దాడికి పాల్పడినట్లు సమాచారం.

అట్రాసిటీ కేసుపై విచారణ



కూకుట్లపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై గురువారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి విచారణ జరిపారు. పలువురు గ్రామస్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గొడవ జరిగిన కల్లుదుకాణంతో పాటు ఎస్సీ కాలనీకి వెళ్లి పలువురితో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాం తనిఖీ

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: పెద్దశంకరంపేటలోని సివిల్ సప్లయి గోదామును పౌరసరఫరాల శాఖ డీఎం హరికృష్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గోదాంలోని బియ్యం స్టాకు వివరాలను, రిజిష్టర్ల నిర్వహణను పరిశీలించారు. ఈ నెలలో పంపిణీ అయిన బియ్యం సరఫరాను అడిగి తెలుసుకున్నారు. గోదాం నిర్వహణ తీరు సరిగ్గా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తి చేశారు. ఆయన వెంట గోదాం ఇన్‌ఛార్జి దత్తారెడ్డి తదితరులు ఉన్నారు.

అజ్జమర్రిలో గొడవ

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: అజ్జమర్రిలో భవానీ మాత మాలధారణ వేసుకునేందుకు వచ్చిన వ్యక్తిని ఓ కమిటీ సభ్యులు మద్యం తాగి ఉన్నందున నిరాకరించారు. ఇది గొడవకు దారితీసింది. విషయం తెలుసుకున్న నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి చిలప్‌చెడ్, కౌడిపల్లి ఎస్సైలు యాదగిరి, రంజిత్‌కుమార్‌రెడ్డిలు గ్రామానికి చేరుకుని గొడవ పడుతున్న వారిని అదుపు చేశారు.

రాయితీపై రుణాలు అందించరూ..



రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో కుమ్మరిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ

తూప్రాన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మట్టిపాత్ర వినియోగానికి పెద్దపీట వేస్తూ కుమ్మరులకు రాయితీపై రుణాలు అందించేలా చొరవ తీసుకోవాలని రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ మంత్రి కొండా సురేఖను కోరారు. గజ్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో బాలకృష్ణ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టిపాత్రలు, మట్టితో తయారు చేసిన వస్తువులను వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

కేటీఆర్, హరీశ్‌రావులపై మైనంపల్లి వ్యాఖ్యలు శోచనీయం

మెదక్, న్యూస్‌టుడే: మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలు శోచనీయమని మెదక్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బట్టి జగపతి అన్నారు. గురువారం స్థానిక భారాస జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెప్పుకోసం మాజీ మంత్రులపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏ ప్రొటోకాల్ ప్రకారం మాజీ ఎమ్మెల్యేకు రెండు ఎస్కార్ట్ వాహనాలు కేటాయించారన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయరాజ్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.